సాక్షి ఖమ్మం

శుక్రవారం : 29 : ఆగస్టు : 2025



తగిన జాగ్రత్తలతోనే రక్షణ

భారీ వర్షాల నేపథ్యాన రైతులు సరైన జాగ్రత్తలు పాటిస్తూ పంటలను కాపాడుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి పుల్లయ్య తెలిపారు. 8లో



జిల్లాకు ఒక్కరే కోచ్

జిల్లాలో క్రీడారంగానికి సంబంధించి ఒకే కోచ్ ఉండగా.. మిగతా క్రీడాంశాల్లో సీనియర్ క్రీడాకారులతోనే శిక్షణ కొనసాగుతోంది. 8లో



వాతావరణం

జిల్లా అంతటా శుక్రవారం కనిష్టస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. సాయంత్రం తర్వాత కొన్నిచోట్ల వర్ష సూచనలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

ఎక్సైజ్ కోర్టు జడ్జిగా అఖిల



జిల్లా జడ్జి రాజగోపాల్‌కు మొక్క అందజేస్తున్న అఖిల

ఖమ్మం లీగల్: ఖమ్మం ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తిగా అఖిల గౌడ గురువారం బాధ్యతలు స్వీకరించారు. మంచిర్యాలకు చెందిన ఆమె ఉస్మానియా యూనివర్సిటీలో లా పూర్తిచేశాక న్యాయవాదిగా ఎల్‌బీ నగర్ కోర్టులో ఎన్‌రోల్ అయ్యారు. అక్కడే మూడేళ్లు న్యాయవాదిగా కొనసాగిన అఖిల జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికై ఖమ్మంలో మొదటి పోస్టింగ్ సాధించారు. తల్లిదండ్రుల సహకారంతో న్యాయమూర్తిగా ఎంపికైన తాను, బార్, బెంచ్‌తో మంచి సంబంధాలు కొనసాగిస్తూ కక్షిదారులకు సత్వర న్యాయం అందేలా కృషి చేస్తానని తెలిపారు. కాగా, బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తొండపు వెంకటేశ్వరరావు, కార్యవర్గ బాధ్యులు అఖిలకు శుభాకాంక్షలు తెలిపారు.

5న మహిళా అభ్యర్థులకు అగ్నివీర్ ర్యాలీ

ఖమ్మం రాపర్తినగర్: వైమానిక దళంలో చేరేందుకు ఆసక్తి ఉన్న మహిళలకు వచ్చే నెల 5న అగ్నివీర్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎన్.మాధవి తెలిపారు. చెన్నై తాంబరంలోని ఎయిర్‌మెన్ సెలక్షన్ సెంటర్‌లో ఈ ర్యాలీ జరుగుతుందని వెల్లడించారు. వైమానిక దళంలో క్లరికల్, టెక్నికల్ క్యాడర్‌లో ఉద్యోగావకాశాలు ఉన్నాయని తెలిపారు. అవివాహితులై, ఇంటర్ లేదా మూడేళ్ల డిప్లొమా ఇంజనీరింగ్ కోర్సు పూర్తిచేసిన వారు అర్హులని పేర్కొన్నారు. అంతేకాక ఎత్తు 152 సెం.మీ., వయస్సు 17 1/2 నుంచి 21ఏళ్ల లోపు వారు పాల్గొనవచ్చని తెలిపారు.

ఐటీ హబ్‌లో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని ఐటీ హబ్‌లో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రాంతీయ కేంద్రం మేనేజర్ అశోక్ తెలిపారు. హెచ్‌టీఎంఎల్-5, సీఎస్ఎస్-3, జావా స్క్రిప్ట్, బూట్‌స్ట్రాప్-5, జావా, పైథాన్, డేటాబేస్ తదితర అంశాలతో పాటు సాంకేతిక నైపుణ్యాలపై తరగతులు ఉంటాయని వెల్లడించారు. డిగ్రీ, ఇంజనీరింగ్, ఇతర కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు సెప్టెంబర్ 6వ తేదీలోగా ఐటీ హబ్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 95025 05880 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

జీపీల్లో పారిశుద్ధ్య పనులకు రూ.2లక్షలు

రఘునాథపాలెం: గ్రామపంచాయతీల్లో నిధుల కొరతతో బ్లీచింగ్ పౌడర్ కూడా కొనలేని పరిస్థితి నెలకొనడం, వర్షాలతో పారిశుద్ధ్య సమస్య ఏర్పడి వ్యాధులు వ్యాప్తి చెందుతున్నందున ప్రభుత్వం స్పందించింది. ఈమేరకు జిల్లా వ్యాప్తంగా మండలానికి రూ.2లక్షల చొప్పున నిధులు విడుదల చేసింది. ఈ నిధులను మండల పంచాయతీ అధికారి పర్యవేక్షణలో జీపీల అవసరాలకు అనుగుణంగా బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు, తాగునీటి ట్యాంకుల క్లోరినేషన్, ఫాగింగ్‌కు వినియోగించాలని సూచించారు. నిధుల విడుదలతో గ్రామాల్లో కనీస పనులు చేయించలేని పరిస్థితి ఎదుర్కొంటున్న గ్రామ కార్యదర్శులకు ఊరట లభించినట్లయింది.

ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులు

ఖమ్మంమయూరిసెంటర్: ఎస్సీ సంక్షేమశాఖ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ ఎం.రాజ్యలక్ష్మి తెలిపారు. ఐదు తరగతిలో చేరేందుకు కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ రాసిన వారే అర్హులని పేర్కొన్నారు. ఇక 6నుంచి 9వ తరగతుల్లో బ్యాక్ లాగ్ వేకెన్సీ(బీఎల్‌వీ సెట్) పరీక్ష రాసిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అంతేకాక ఇంటర్ మొదటి సంవత్సరంలో ఖాళీ సీట్లను సైతం ప్రతిభ ఆధారంగా భర్తీ చేస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు శుక్రవారం అన్ని వివరాలతో కూడిన దరఖాస్తులను ఖమ్మంలోని డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ జూనియర్ కళాశాలలో అందజేయాలని సూచించారు.

ఓటర్ల ముసాయిదా ప్రకటన

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని గ్రామపంచాయతీల్లో ఓటర్ల ముసాయిదా జాబితాలను గురువారం విడుదల చేశారు. మొత్తం 571 జీపీల్లోని 5,214 వార్డుల వారీగా జాబితా ప్రకటించారు. ఈమేరకు మొత్తం 8,02,690మంది ఓటర్లు ఉన్నట్లు తేలింది. ఇందులో పురుషులు 3,88,244, మహిళలు 4,14,424తో పాటు ఇతరులు 22 మంది ఉన్నారు. కాగా, గ్రామాల్లో జాబితాను ఔత్సాహికులు పరిశీలిస్తూ రిజర్వేషన్లపై అంచనాల్లో నిమగ్నమయ్యారు.

కొలువుదీరిన గణపయ్య!



ఖమ్మం పంపింగ్ వెల్ రోడ్డులో వరుసగా ఏర్పాటైన మూడు మండపాలు

జిల్లావ్యాప్తంగా ఊరూవాడ తేడా లేకుండా వినాయకుడు కొలువుదీరాడు. వీధివీధినా ఆకట్టుకునే రీతిలో మండపాలను తీర్చిదిద్దిన నిర్వాహకులు ఊరేగింపుల నడుమ గణనాయకుడిని చేర్చారు. ఈ క్రమాన చిన్నాపెద్ద ఉత్సాహంగా నృత్యాలతో ముందుకు సాగారు. అయితే, బుధవారం రోజంతా వర్షం కురిసినా నిర్వాహకుల ఉత్సాహం ఏ మాత్రం తగ్గలేదు. మండపాల్లో స్వామిని కొలువుదీర్చాక ప్రత్యేక పూజలు ప్రారంభించగా.. గురువారం విద్యాసంస్థలకు సెలవు ప్రకటించడంతో అన్నివర్గాల ప్రజలు పాల్గొన్నారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్



ఖమ్మం ఎన్నెస్పీ రోడ్డులో హనుమంతుడి ఆకారంలోని వినాయక విగ్రహం



ఖమ్మం శివాలయం వీధిలో భారీ మట్టి వినాయకుడు

అంతటా వర్షం..

జిల్లాను వర్షం కమ్మేసింది. భారీ వర్షంతో లోతట్టు ప్రాంతాల్లోకి నీరు చేరగా.. జిల్లాలోని పలు వాగుల ఉధృతితో రాకపోకలు స్తంభించాయి. అలాగే, రిజర్వాయర్లు, చెరువుల్లోకి భారీగా వరద చేరుతోంది. వైరా, కొణిజర్ల, కల్లూరు మండలాల్లోని కొన్ని గ్రామాల్లోని ఇళ్లలోకి నీరు ప్రవేశించింది.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

- బుధవారం నగటున 8.9 సెం.మీ.గా నమోదు
- సత్తుపల్లిలో అత్యధికంగా 17.5 సెం.మీ.
- వాగులు, చెరువుల ఉధృతితో పలుచోట్ల నిలిచిన రాకపోకలు



అలుగు పోస్తున్న పెనుబల్లి మండలంలోని లంకాసాగర్ ప్రాజెక్టు

దంచికొట్టింది..

జిల్లాలో జోరువాన పడింది. బుధవారం ఉదయం 8-30 నుంచి గురువారం ఉదయం 8-30 గంటల వరకు 8.9 సెం.మీ. వర్షపాతం నమోదు కాగా.. అత్యధికంగా సత్తుపల్లి మండలంలో 17.5గా నమోదైంది. ఇక ఖమ్మంరూరల్‌లో 12.6, చింతకానిలో 12.4, కొణిజర్లలో 12 సెం.మీ. వర్షపాతం నమోదైందని అధికారులు వెల్లడించారు. ఆతర్వాత పరిస్థితి కుదుటపడగా గురువారం ఉదయం 8-30 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు 5.3 మి.మీ.గా నమోదైంది. కల్లూరు మండలంలోని ముగ్గు వెంకటాపురం, వైరాలోని రాజీవ్‌నగర్, ఇందిరమ్మ కాలనీల్లోకి వరద నీరు చేరడంతో కాలనీవాసులను అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించారు. అలాగే, కొణిజర్ల మండలం లక్ష్మీపురంలో ఇళ్లలోకి సైతం వరద వచ్చింది.

రిజర్వాయర్లలోకి వరద..

రెండు రోజులుగా జిల్లాతోపాటు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో భారీ, మధ్య తరహా ప్రాజెక్టులు, చెరువుల్లోకి వరద చేరుతోంది. పాలేరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నీటిమట్టం 23 అడుగులు కాగా ప్రస్తుతం 20.70 అడుగులుగా ఉంది. ఇన్‌ఫ్లో 6,118 క్యూసెక్కుల్లో 4,328 క్యూసెక్కుల వరద సాగర్ ప్రాజెక్టు నుంచి వస్తోంది. వైరా రిజర్వాయర్ 18.30 అడుగులకు గాను 19.03 అడుగులుగా ఉండడంతో ఐదు అలుగుల ద్వారా వరద బయటకు వెళ్తోంది. పెనుబల్లి మండలం లంకాసాగర్ ప్రాజెక్టు నీటిమట్టం 16 అడుగులకు గాను 16.06 అడుగులు ఉంది. ఇక్కడ 7,270 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 880 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. అలాగే, తీర్థాల వద్ద మున్నేరు నీటిమట్టం 20 అడుగులకు 10.75 అడుగులు, ఖమ్మం కాల్వొడ్డు వద్ద మున్నేటి నీటిమట్టం గురువారం సాయంత్రం 8.50 అడుగులుగా ఉంది.

రాకపోకలకు అంతరాయం

జిల్లాలోని సత్తుపల్లి, వైరా, కొణిజర్ల, చింతకాని మండలాలతోపాటు ఎర్రుపాలెం, ఏన్కూరు మండలాల్లో వర్ష ప్రభావం అధికంగా ఉంది. సత్తుపల్లి -రాజీవ్ నగర్ రోడ్డుకు వరద పోటెత్తడంతో రహదారిపై రాకపోకలు నిలిపివేశారు. సత్తుపల్లి మండలం కిష్టారం - యాతాలకుంట మధ్య రహదారి మూసేశారు. ఇక సత్తుపల్లి నుంచి ఖమ్మం వెళ్లే హైవేపై కిష్టారం వద్ద రెండు అడుగులకు పైగా నీరు వెళ్తుండడంతో రాకపోకలు నిలిపేశారు. తల్లాడ మండలం బిల్లుపాడు - రామచంద్రాపురం మధ్య, వెంగన్నపేట-నూతనకల్ మధ్య, వైరా మండలం అష్ణగుర్తి-ప్రొద్దుటూరు, పాలడుగు -వల్లాపురం మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఏన్కూరు మండలం రేపల్లెవాడ-నాచారం మధ్య కూడా ఇదే పరిస్థితి నెలకొంది. చింతకాని మండలం రామకృష్ణాపురం వద్ద ఖమ్మం-బోనకల్ రహదారిపై రాకపోకలను నిలిపివేశారు. ఇక వర్ష ప్రభావంతో ఖమ్మంలోని బైపాస్ రోడ్డుపై సైతం వర్షపునీరు ప్రవహించింది.



చింతకాని : ధంసలాపురం వద్ద అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ అనుదీప్



కొణిజర్ల : తీగలబంజర వద్ద పగిడేరు ఉధృతిని పరిశీలిస్తున్న సీపీ సునీల్‌దత్

రిజర్వాయర్ల నీటిమట్టం వివరాలు (అడుగుల్లో)

రిజర్వాయర్	నీటిమట్టం	ప్రస్తుతం
పాలేరు	23	20.70
వైరా	18.30	19.03
లంకాసాగర్	16.0	16.06
మున్నేరు (తీర్థాల)	20	10.75
మున్నేరు (ఖమ్మం)	41	8.50

24గంటల్లో అత్యధిక వర్షపాతం నమోదైన ప్రాంతాలు (సెం.మీ.ల్లో)

మండలం	వర్షపాతం
సత్తుపల్లి	17.5
ఖమ్మంరూరల్	12.6
చింతకాని	12.4
కొణిజర్ల	12.0
తల్లాడ	11.8
వైరా	11.4
వేంసూరు	11.1
పెనుబల్లి	10.5
ఎర్రుపాలెం	9.6
కామేపల్లి	9.5

అప్రమత్తంగా ఉండండి..

చింతకాని/ఖమ్మం వైరారోడ్: భారీ వర్షాల నేపథ్యాన ప్రజలతో పాటు అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. చింతకాని మండలం రామకృష్ణాపురం చెరువు అలుగుపారి ఖమ్మం-బోనకల్ రహదారిలోని ధంసలాపురం వద్ద ఉధృతంగా ప్రవహిస్తుండగా ఆయన పరిశీలించారు. ప్రజలకు ఇబ్బంది ఎదురైతే 1077 లేదా వాట్సాప్ నంబర్ 90632 11298కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. వరద పెరిగితే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. తహసీల్దార్ సైదులు, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, కార్పొరేటర్ మేడారపు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. అలాగే, వరద పరిస్థితులు, సహాయక చర్యలకు సన్నద్ధతపై ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కలెక్టర్ అనుదీప్‌తో ఫోన్‌లో మాట్లాడారు.

విస్తృతంగా పెట్రోలింగ్

కొణిజర్ల/ఖమ్మం క్రైం: వర్షాల నేపథ్యాన ప్రజలు అప్రమత్తంగా ఉంటూ నీట మునిగిన రోడ్లు దాటే ప్రయత్నం చేయొద్దని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ సూచించారు. కొణిజర్ల మండలం లాలాపురం, తీగలబంజర మధ్య పగిడేరు ఉధృతిని పరిశీలించిన సీపీ మాట్లాడారు. ప్రవాహాల వద్ద పోలీసు సిబ్బందిని పెట్రోలింగ్‌కు నియమించామని చెప్పారు. అత్యవసర సమయాన పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్ 87126 59111కు ఫోన్ చేయాలని సూచించారు. కొణిజర్ల ఎస్ఐ సూరజ్ పాల్గొన్నారు.

అలుగు పారుతున్న 290 చెరువులు



అలుగు పారుతున్న చిమ్మపుడి చెరువు వద్ద చేపల వేట

ఖమ్మంఅర్బన్: జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలతో చెరువులు, జలాశయాలు పొంగి పొర్లుతున్నాయి. పుష్కలంగా వరద రావడంతో చెరువులన్నీ పూర్తిస్థాయి సామర్థ్యానికి చేరాయి. జిల్లాలోని మొత్తం 1,061 చెరువులకు గాను గురువారం నాటికి 290 అలుగు పారుతున్నాయి. ఇక 0-25 శాతం 19, 25-50శాతం 73, 50-75 శాతం మేర 105 చెరువులు నిండాయి. అలాగే, 75-90 శాతం 200, 90-100శాతం మేర 374 చెరువుల్లోకి నీరు చేరిందని జలవనరులశాఖ అధికారులు వెల్లడించారు.

కమీషన్ రాకపోతే రేషన్‌షాపులు బంద్



ఖమ్మం సహకారనగర్: డీలర్లకు నెలలు తరబడి పెండింగ్ ఉన్న కమీషన్‌ను ఈనెల 31వ తేదీ వరకు విడుదల చేయాలని తెలంగాణ రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బానోతు వెంకన్న, షేక్ జానీమియా, వర్కింగ్ ప్రెసిడెంట్ దొండా దుర్గయ్య కోరారు. లేనిపక్షంలో సెప్టెంబర్ 1నుంచి రేషన్‌షాపులు బంద్ చేస్తామని ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నిర్ణయం తీసుకోగా, 1వ తేదీన తహసీల్‌ల ఎదుట, 2న ఆర్డీఓ కార్యాలయాల ఎదుట, 3వ తేదీన కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయడమే కాక 4న అసెంబ్లీ ముట్టడి చేపడతామని తెలిపారు.

కష్టపడే తత్వం తప్పనిసరి

- ఉన్నత లక్ష్యం.. ఏకాగ్రతతో మెరుగైన ఫలితాలు
- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ అనుదీప్

ఖమ్మంమయూరిసెంటర్: పరిస్థితులు ఎలా ఉన్నా, ఏం చదివినా కష్టపడే తత్వం ఉండాలని, తద్వారా అనుకున్న లక్ష్యాన్ని సాధించొచ్చని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. 'మిషన్ వాత్సల్య' కార్యక్రమంలో భాగంగా పీఎం కేర్స్ పథకం కింద పిల్లలకు ఆర్థిక అక్షరాస్యతపై ఏర్పాటుచేసిన చేసిన అవగాహన సదస్సులో కలెక్టర్ మాట్లాడారు. కోవిడ్ సమయాన తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు పీఎం కేర్స్ కింద రూ.10లక్షల డిపాజిట్ చేయడంతో పాటు వారి చదువు సాఫీగా సాగేలా సహకారం అందిస్తున్నామన్నారు. జిల్లాలో 13మంది పిల్లల పేరిట చేసిన డిపాజిట్ 23ఏళ్లు నిండాక డ్రా చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. విభిన్న కుటుంబ నేపథ్యం కలిగి ఉన్నా కష్టపడే తత్వం ఉంటే ఉన్నత స్థానాలకు చేరొచ్చని చెప్పారు. తాను మూడు సార్లు సివిల్స్ రాసినా ఫలితం రాకపోయినప్పటికీ నిరుత్సాహ పడకుండా మరింత కష్టపడ్డానని గుర్తుచేశారు. అనంతరం పిల్లలతో కలిసి కలెక్టర్ అనుదీప్ భోజనం చేశారు. జిల్లా సంక్షేమ అధికారి కె.రాంగోపాల్‌రెడ్డి, జిల్లా బాలల సంరక్షణ కమిటీ చైర్ పర్సన్ భారతిరాణి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి విష్ణువందన పాల్గొన్నారు.

■ జిల్లాకు చెందిన ఇద్దరు వ్యక్తులు వారి తమ్ముళ్ల కుమార్తెలను వేర్వేరుగా సీఏఆర్ఏ(సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ) నిబంధనల ప్రకారం గురువారం దత్తత తీసుకున్నారు. ఈమేరకు ఉత్తర్వులను కలెక్టర్ అనుదీప్ వారికి అందజేసి మాట్లాడారు. ఎవరైనా సరే 'కారా' నిబంధనల ప్రకారమే దత్తత తీసుకోవాలని, దీన్ని విస్మరిస్తే ఇక్కట్లు ఎదురవుతాయని తెలిపారు. డీడబ్ల్యూఓ కె.రామ్‌గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

■ ఖమ్మం సహకారనగర్: చేతన ఫౌండేషన్ ఆధ్వర్యాన నిరుపేద ఇంజనీరింగ్ విద్యార్థిని ఉప్పు వాసంతికి సమకూర్చిన ల్యాప్‌టాప్‌ను గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అనుదీప్ అందజేశారు. ఫౌండేషన్ ప్రతినిధులు దొడ్డా సీతారామయ్య, ముత్తినేని సురేష్, చంద్రకాని నవీన్ పాల్గొన్నారు.

జవాబుదారీతనంతో పనిచేయాలి

విద్యాశాఖపై సమీక్షలో అదనపు కలెక్టర్ శ్రీజ



అధికారులతో సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మం సహకారనగర్: అధికారులు జవాబుదారీతనంతో పనిచేయడం ద్వారా ప్రభుత్వ విద్యారంగంలో మెరుగైన ఫలితాలు వస్తాయని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం ఆమె విద్యాశాఖపై సమీక్షించారు. ఈ సందర్భంగా శ్రీజ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో యూనిఫామ్ మొదటి జత అందని కొత్త విద్యార్థులు, రెండో జత రాని విద్యార్థుల వివరాలు అందించాలని సూచించారు. అలాగే, పాఠ్యపుస్తకాల పంపిణీని పూర్తిచేసి యూనిఫామ్, పుస్తకాల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఎక్కడైనా పుస్తకాలు అందుబాటులో లేకపోతే లభ్యత ఉన్న పాఠశాలల నుంచి తీసుకోవాలని తెలిపారు. విద్యార్థుల వివరాలు జిల్లా లాగిన్‌లో నమోదు అయ్యేలా సీఎంఓ పర్యవేక్షించాలని, గైర్హాజరైతే తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వాలని ఆమె సూచించారు. కాగా, పదోన్నతులు కారణంగా ఏర్పడిన ఖాళీలు, అవసరమున్న పాఠశాలల్లో అదనంగా ఉన్న చోట్ల నుంచి ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఓ సన్యాసయ్య, విద్యాశాఖ ప్లానింగ్ కోఆర్డినేటర్ రామకృష్ణ, ఎంఈఓలు పాల్గొన్నారు.

ఈ బదిలీలు మాకొద్దు..

- రద్దు, మార్పు కోసం పీఏసీఎస్ కార్యదర్శుల వినతి
- కోర్టును ఆశ్రయించిన మరికొందరు

ఖమ్మంవ్యవసాయం: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘా(పీఏసీఎస్)ల్లో కార్యదర్శుల బదిలీలపై భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. సహకార వ్యవస్థ చరిత్రలో పీఏసీఎస్‌ల కార్యదర్శులను ఇటీవల తొలిసారి బదిలీ చేశారు. అయితే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని కొందరు స్వాగతిస్తుండగా, మరికొందరు వ్యతిరేకిస్తున్నారు. అంతేకాక ఉమ్మడి కరీంగనర్, నల్లగొండ, వరంగల్, మెదక్ జిల్లాల సహకార సంఘాల కార్యదర్శుల్లో కొందరు బదిలీలను వ్యతిరేకిస్తూ కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఇచ్చే తీర్పు ఆధారంగా కార్యదర్శులు నూతన స్థానాల్లో చేరే అవకాశం ఉంది. అయితే కోర్టు తీర్పు రాష్ట్రం యూనిట్ వచ్చే అవకాశముందని తెలుస్తోంది. ఖమ్మం డీసీసీబీ పరిధిలో 69మంది పీఏసీఎస్ కార్యదర్శులను బదిలీ చేశారు. ఇందులో 17 మంది తమను దూర ప్రాంతాలకు బదిలీ చేసినందున సమీప స్థానాలకు మార్చాలని, లేదా రద్దు చేసి పాత స్థానమే కేటాయించాలని గురువారం డీసీసీబీ సీఈఓ ఎన్.వెంకట్ ఆదిత్యకు వినతిపత్రం అందించారు. పీఏసీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు విప్పా శ్రీనివాసరావు, వీరబాబు, వనమా మల్లికార్జున్ వినతిపత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు. ఇదే సమయాన కొందరు పొరుగు జిల్లాల కార్యదర్శులు కోర్టుకు వెళ్లినందున తీర్పు కోసం వేచి చూస్తున్నారు. కాగా, డిస్ట్రిక్ట్ లెవల్ ఎంపవర్‌మెంట్ కమిటీ(డీఎల్ఈసీ) చేపట్టిన బదిలీ ప్రక్రియకు సంబంధించి ఉత్తర్వులు 69 మంది కార్యదర్శులకు బుధవారం అందాయి. ఆయా కార్యదర్శులు నూతన స్థానాల్లో వెంటనే చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నప్పటికీ గురువారం వరకు ఎవరూ చేరకపోవడం గమనార్హం.

బీఆర్ఎస్ హయాంలోనే గ్రామాల అభివృద్ధి

ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ మధు



రోడ్డు వెంట నిలిచిన మురుగును పరిశీలిస్తున్న ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్సీ మధు

కారేపల్లి: బీఆర్ఎస్ పాలనలోనే గ్రామాల అభివృద్ధి జరిగిందని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ తెలిపారు. కారేపల్లి మండలం కారేపల్లి క్రాస్‌రోడ్డు (రామలింగాలపల్లి)లో ఎంపీ, ఎమ్మెల్సీ గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో డ్రైనేజీలు లేక మురుగునీరు నిలిచి దోమలు వృద్ధి చెందుతున్నాయని స్థానికులు తెలిపారు. ఈ మేరకు ఎంపీ మాట్లాడుతూ డ్రైనేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు సమర్పిస్తే నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు అనంతరం వారు మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ గ్రామాల అభివృద్ధికి అత్యధిక నిధులు కేటాయించారని తెలిపారు. ఆతర్వాత కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో మళ్లీ పాత పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. తొలుత ఇటీవల మృతి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు జడల వెంకటేశ్వర్లు కుటుంబాన్ని ఎంపీ, ఎమ్మెల్సీ కారేపల్లిలో పరామర్శించారు. ఈ కార్యక్రమాల్లో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దిండిగల రాజేందర్, బీఆర్ఎస్ నాయకులు లకావత్ గిరిబాబు, వాంకుడోతు జగన్, గౌసుద్దీన్, ఆదెర్ల రాములు, ఖలీలుల్లాఖాన్, మణికొండ నాగేశ్వరరావు, ముత్యాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముస్తాబైన టీ.టీ. ఇండోర్ హాల్



ప్రారంభానికి సిద్ధమైన ఇండోర్ హాల్

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో టేబుల్ టెన్నిస్ ఇండోర్ హాల్ సిద్ధమైంది. దాదాపు రూ.50లక్షల వ్యయంతో ఇండోర్ హాల్ నిర్మాణానికి గత జూన్‌లో శంకుస్థాపన చేయగా పనులు పూర్తయ్యాయి. ఇందులో మొత్తం ఐదు టేబుల్ టెన్నిస్ బోర్డులు ఏర్పాటుచేశారు. ఇన్నాళ్లు స్క్వాష్ కోర్టులోనే టేబుల్ టెన్నిస్ క్రీడాకారులు ఆడుతుండగా.. ఇప్పుడు విశాలమైన హాల్ అందుబాటులోకి రానుండడంతో క్రీడాకారుల ఇక్కట్లు తీరనున్నాయి.

చాంపియన్‌కు స్వామి రమేష్ నజరానా


స్వామి రమేష్‌కుమార్

ఖమ్మం స్పోర్ట్స్: సౌత్ ఏషియా బాడీబిల్డింగ్ చాంపియన్‌షిప్‌లో ఓవరాల్ టైటిల్ దక్కించుకున్న రాజస్తాన్ బాడీబిల్డర్ అర్షన్ ఖాన్ మిస్టర్ ఏషియాగా నిలిచాడు. ముందుగా ప్రకటించిన మేరకు ఇండియన్ బాడీ బిల్డింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు న్యాయవాది స్వామి రమేష్‌కుమార్ రూ.3లక్షల నజరానా అందజేశారు. ఈనెల 18నుంచి 25 వరకు బ్యాంకాక్‌లో జరిగిన సౌత్ ఏషియా చాంపియన్‌షిప్‌లో భారత్‌కు మూడు స్వర్ణ, రెండు రజత, రెండు కాంస్య పతకాలు దక్కాయి. ఇందులో అర్షన్‌ఖాన్ చాంపియన్ ఆఫ్ ది చాంపియన్‌గా నిలవగా స్వామి రమేష్ నగదు అందజేశారు.

యంత్రాల సరఫరాకు టెండర్లు

ఖమ్మంవైద్యవిభాగం: డెంగీ ఎలీసా వాషర్, రీడర్ మిషన్ల సరఫరాకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ కళావతిబాయి తెలిపారు. ఆసక్తి ఉన్న వారు సీల్డ్‌టెండర్లను ఈనెల 31న సాయంత్రం ఐదు గంటల్లోగా కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. వీటిని సెప్టెంబర్ 1న పరిశీలించి అర్హత ఉన్న వాటిని ఖరారు చేస్తామని తెలిపారు.

నేటి నుంచి అండర్-15 రాష్ట్ర బ్యాడ్మింటన్ టోర్నీ

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యాన అండర్-15 రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు శుక్రవారం నుంచి ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ప్రారంభంకానున్నాయి. తొలుత గురువారం నిర్వహించిన క్వాలిఫై రౌండ్‌లో అత్యధికంగా బాలికలే హాజరయ్యారు. ఇప్పటివరకు 134 ఎంట్రీలు అందగా, ఇందులో 75మంది బాలికలు, 59మంది బాలురు ఉన్నారు. నాకౌట్ పద్ధతిలో మూడు రోజుల పాటు మ్యాచ్‌లు జరుగుతాయని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కర్నాటి వీరభద్రం, వి.చంద్రశేఖర్ తెలిపారు. పోటీల నిర్వహణలో ప్యాట్రన్లు సిరిపురపు సుదర్శన్, పి.రవిమారుత్, పి.యుగంధర్‌తో పాటు జట్ల శ్రీను, దుద్దుకూరి సత్యనారాయణ, కొంగర శ్రీనివాస్, ఆర్.శ్రీనివాస్‌రెడ్డి పాలుపంచుకుంటున్నారు.

జాతీయ రహదారిపై స్పీడ్‌గన్


స్పీడ్‌గన్‌ను పరిశీలిస్తున్న ఎస్‌ఐ హరిత, సిబ్బంది

ముదిగొండ: ఖమ్మం-కోదాడ జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యాన వాహనాల వేగాన్ని అరికట్టేందుకు ముదిగొండ సమీపాన స్పీడ్ గన్‌ను ఏర్పాటు చేయించారు. గోకినేపల్లి, వెంకటాపురం, ముదిగొండ, సువర్ణాపురం సమీపాన తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో ముదిగొండ సీఐ ఓ.మురళి ఈ నిర్ణయం తీసుకున్నారు. స్పీడ్‌గన్ ఏర్పాటుతో వాహనాల వేగాన్ని పరీక్షిస్తూ నిర్ణీత వేగం దాటితే చలాన్లు జారీ చేస్తారు. తద్వారా వాహనాల వేగం నియంత్రణ సాధ్యమవుతుందని భావిస్తున్నారు. కాగా, స్పీడ్ గన్ పనితీరును గురువారం ఎస్‌ఐ హరిత పరిశీలించగా ఉద్యోగులు జి.వెంకన్న, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	4,625	3,400
ఏసీ మిర్చి	15,525	8,000
మిర్చి	8,600	7,000
పత్తి	7,000	6,211

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.18,052

జిల్లాలో ఒక్కరే కోచ్..

- మిగతా క్రీడాంశాలకు సీనియర్ క్రీడాకారులే దిక్కు
- ఫలితంగా ఔత్సాహికులకు అందని శిక్షణ

నేడు జాతీయ క్రీడా దినోత్సవం


అథ్లెటిక్స్‌లో శిక్షణ ఇస్తున్న కోచ్

ఖమ్మం స్పోర్ట్స్: స్పోర్ట్స్ అథారిటీ తీరుతో ఔత్సాహిక క్రీడాకారులకు మెరుగైన శిక్షణ అందని పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లా కేంద్రంతో పాటు వైరా, మధిర, సత్తుపల్లిలో స్టేడియాలు ఉన్నా శిక్షకుల నియామకంపై ముందడుగు పడడం లేదు. జిల్లాలో కొన్నాళ్ల క్రితం వరకు ఇద్దరు శాట్స్ కోచ్‌లు ఉండగా.. ప్రస్తుతం ఒకరే కొనసాగుతున్నారు. అదీ జిల్లా కేంద్రంలో అథ్లెటిక్స్ అకాడమీలో ఉండగా.. మిగిలిన అన్ని క్రీడాంశాలకు సీనియర్ క్రీడాకారులే శిక్షణ ఇవ్వాల్సి వస్తోంది. నియోజకవర్గ కేంద్రాలతో పాటు గ్రామ పంచాయతీల్లోనూ పల్లె క్రీడాప్రాంగణాలను ఏర్పాటుచేసినా కోచ్‌ల నియామకం లేక సీనియర్ క్రీడాకారులు, పీఈటీలే శిక్షణ ఇస్తుండడం గమనార్హం.

క్రీడా మౌలిక వసతులే మార్గం..

ఇటీవల హైదరాబాద్‌లో నూతన క్రీడా పాలసీపై నిర్వహించిన సదస్సులో జిల్లా క్రీడా సంఘాలు, స్పోర్ట్స్ అథారటీ బాధ్యులు పాల్గొన్నారు. గ్రామీణస్థాయి నుంచి క్రీడాకారులను వెలికితీసే ప్రయత్నం చేస్తే బాగుంటుందని, ఇందుకు కావాలిస్న నిధులను మంజూరు చేయాలన్న అంశాన్ని ఎవరూ ప్రస్తావించలేదని తెలిసింది. గ్రామాల్లో క్రీడా మౌలిక వసతులు కల్పించే దిశగా ఆలోచన చేస్తేనే క్రీడారంగంలో మెరుగైన ఫలితాలు వస్తాయి. ఈ విషయంలో ప్రభుత్వం, శాట్స్ పట్టింపు లేనితనం క్రీడాకారులకు శాపంగా మారుతోంది.

నియామకంతోనే ఫలితం

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్(ఎన్‌ఐఎస్)లో రెండేళ్ల కాలం శిక్షణ పూర్తి చేసిన వారిని కోచ్‌లుగా నియమిస్తే బాగుంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే భారత క్రీడా ప్రాధికార సంస్థ (శాయ్) సీనియర్ క్రీడాకారుల సౌకర్యార్థం ఆరు వారాల కోర్సును అందుబాటులోకి తీసుకొచ్చింది. క్రీడల్లో నిష్ణాతులైన వారు ఈ కోర్సు చేస్తే క్రీడాకారులకు మంచి శిక్షణ ఇవ్వగలరనే నమ్మకంతో ఏర్పాటు చేశారు. కానీ రెండేళ్ల కోర్సు చేస్తేనే కోచ్‌గా పరిగణనలోకి తీసుకుంటూ, సర్టిఫికెట్ కోర్సు చేసిన వారిని అంతగా పట్టించుకోవడం లేదని సమాచారం. ప్రస్తుతం శిక్షకులుగా పని చేస్తున్న వారిలో సీనియర్ క్రీడాకారులు తక్కువ మంది ఉండగా.. క్రీడలపై అవగాహనతోనే కోచ్‌లుగా కొనసాగుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

అన్ని చోట్ల నియమిస్తాం...



సర్దార్ పటేల్ స్టేడియంలో ప్రతి క్రీడాంశంలో శిక్షకులు ఉన్నారు. ఆయా క్రీడాంశాల్లో ప్రతి ఏటా జరిగే రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. జిల్లాలో కల్లూరు, మధిర, వైరాల్లో స్టేడియాలు అందుబాటులో ఉన్నాయి. అక్కడ కూడా శిక్షకులను నియమించేందుకు చర్యలు తీసుకున్నాం.

– టి.సునీల్‌రెడ్డి, డీవైఎస్‌ఓ

ముందు కోచ్‌లను నియమించాలి



రాష్ట్రంలో ముందుగా కోచ్‌లు, పీఈటీల భర్తీ చేసి అప్పుడు క్రీడల అభివృద్ధి గురించి మాట్లాడితే బాగుటుంది. రాష్ట్రంలో కోచ్‌ల కొరత తీవ్రంగా ఉంది. కోచ్‌ల భర్తీ విషయంలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ తక్షణం చర్యలు తీసుకోవాలి. గ్రామాల్లో మౌలిక సదుపాయాలతో పాటు కోచ్‌లు, పీఈటీలను నియమించాలి.

– పుట్టా శంకరయ్య, ఒలింపిక్ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు

తగిన జాగ్రత్తలతోనే పంటల రక్షణ


కొణిజర్లలో పెసర చేనును పరిశీలిస్తున్న డీఏఓ పుల్లయ్య

వైరా/కొణిజర్ల: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో చేన్లలో నీరు నిలిచి పంటలు దెబ్బతినే అవకాశం ఉన్నందున రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య సూచించారు. వైరా మున్సిపాలిటీ పరిధి సోమవరం నల్లచెరువు వరదతో నీట మునిగిన పంట పొలాలను గురువారం ఆయన పరిశీలించారు. నష్టం జరిగితే రైతులు తక్షణమే అధికారులకు తెలియజేయాలన్నారు. ఆతర్వాత డిజిటల్ క్రాప్ సర్వేను క్షేత్ర స్థాయిలో డీఏఓ పరిశీలించారు. అంతేకాక కొణిజర్ల మండలం కొణిజర్ల – మల్లుపల్లి మధ్య పొంగిపొర్లుతున్న పగిడేరు ఉధృతిని పరిశీలించిన డీఏఓ, కొణిజర్లలో పెసర చేన్లను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ, ఏఓలు మయాన్ మంజుఖాన్, బాలాజీ, ఏఈఓలు శ్రీనివాసరాజు, రాజేశ్ పాల్గొన్నారు.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

ఖమ్మంవ్యవసాయం: భారీ వర్షాల నేపథ్యాన పంటల్లో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డీఏఓ డి.పుల్లయ్య ఒక ప్రకటన విడుదల చేశారు. మరికొద్దిరోజులు వర్ష సూచన ఉన్నందున ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేయొద్దని తెలిపారు. ఉరుములు, మెరుపులతో కూడిన వాతావరణంలో విద్యుత్ స్తంభాలు, తీగలు, చెరువులకు దూరంగా ఉండాలని, చెట్ల కింద నిలబడొద్దని చెప్పారు. ప్రస్తుతం వరి దుబ్బు దశ నుంచి కంకి దశకు చేరుతున్నందున పైరులో నీరు నిల్వ ఉండకుండా చూస్తూ మొక్కకు గాలి తగిలే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే, పత్తి పైర్లు తేమ బారిన పడితే బూడిద తెగులు వచ్చే అవకాశమున్నందున వర్షాలు తగ్గాక 3 గ్రాముల సల్ఫర్‌ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. వేరుకుళ్లు తెగులు నివారణకు కాపరాక్సీ క్లోరైడ్ 3 గ్రాములను లీటర్ నీటిలో కలిపి మొక్కల మొదళ్లు తడిచేలా చుట్టూ నేలపై పోయాలని చెప్పారు. వర్షం తగ్గాక పైరు కోలుకోవడానికి 13:0:45 ఎరువును 5–10 గ్రాములు లేదా 10 గ్రాముల యూరియాను ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. ఇక మొక్కజొన్న అధిక వర్షాలతో భాస్వరం లోపానికి గురైతే ఆకులు ఊదారంగులోకి మారతాయని చెప్పారు. దీని నివారణకు వర్షాలు తగ్గాక 5 గ్రాముల 19:19:19 లేదా 20 గ్రాముల డీఏపీని లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని డీఏఓ సూచించారు.

బ్రిడ్జి పైనుంచి దూకి ఆత్మహత్య

తిరుమలాయపాలెం: మండలంలోని రాకాసితండా వద్ద ఆకేరు బ్రిడ్జి పైనుంచి దూకి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం వీరారం గ్రామానికి చెందిన సిదుముల ఆదెమ్మ చిన్న కుమారుడు మునేష్ (27) మానసిక వ్యాధితో బాధపడుతుండగా, పెద్ద కొడుకు, కోడలితో కలిసి మంగళవారం అర్ధరాత్రి ఆటోలో డోర్నకల్ మండలం చిలక్కోయలపాడులోని ఓ భూత వైద్యుడి వద్దకు తీసుకెళ్లింది. ఆటో రాకాసితండా బ్రిడ్జి వద్దకు చేరగా ఒక్కసారిగా మునేష్ కిందకు దిగి బ్రిడ్జి పైనుంచి దూకాడు. దీంతో బుధవారం ఆకేరులో వెతికినా ఆచూకీ లభించకపోగా, గురువారం అక్వాడెక్ట్ వద్ద మునేష్ మృతదేహాన్ని స్థానికులు గుర్తించి బయటకు తీశారు. ఈమేరకు బాధిత కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆటోడ్రైవర్‌పై పోక్సో కేసు

ఖమ్మంరూరల్: బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన ఆటో డ్రైవర్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ ముష్క రాజు తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక ఆటోలో వెళ్తుండగా డ్రైవర్ ఆమెతో అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు లొంగదీసుకునేందుకు ప్రయత్నించాడు. ఈ విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు తెలపగా వారి ఫిర్యాదుతో తిరుమలాయపాలెం మండలం రఘునాథపాలెంకు చెందిన డ్రైవర్ మట్ట రాముపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

విలువ తెలియదా..?!

వాహనాలు, కలపకు తుప్పు, చెదలు


చెదలు పట్టి మట్టిలో కలిసిపోతున్న కలప


తుప్పు పట్టిపోతున్న వాహనాలు

సత్తుపల్లిటౌన్: విలువైన వాహనాలు.. అంతే స్థాయిలో కలపను భద్రపర్చడంలో అటవీ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో చెదలు పట్టి మట్టిలో కలిసిపోతున్నాయి. అక్రమంగా కలప రవాణా చేస్తున్న వాహనాలను సీజ్ చేయగా సత్తుపల్లి టింబర్ డిపోలో పార్క్ చేశారు. ఇందులో డీసీఎంలు, లారీలు, ఆటోలు, కార్లు, జీప్‌లు, సైకిళ్లు, ద్విచక్రవాహనాలు పదుల సంఖ్యలో ఉన్నాయి. వీటిని నిర్ణీత కాల వ్యవధిలో వేలం వేస్తే అటవీ శాఖకు ఆదాయం సమకూరే అవకాశమున్నా పట్టించుకోకపోవడంతో తుప్పుపట్టి భూమిలో కూరుకుపోతున్నాయి. ఇక అక్రమార్కుల నుంచి స్వాధీనం చేసుకున్న టేకు, జిట్రేగి, నారేప తదితర రకాల విలువైన కలపను సైతం ఏళ్ల తరబడి నేలపై వదిలిలేయడంతో చెదలు పట్టి మట్టిలో కలిసిపోయే పరిస్థితి నెలకొంది. కేసులు త్వరగా పరిష్కారమయ్యేలా చూస్తూ వాహనాలు, కలపకు వేలం వేస్తే అటవీశాఖకు ఆదాయం లభిస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

తల్లాడ/వేంసూరు: తల్లాడ, రంగంబంజరల్లో పేకాట స్థావరాలపై గురువారం పోలీసులు దాడులు నిర్వహించారు. తల్లాడలో ఐదుగురిని అదుపులోకి తీసుకుని రూ.30,780 నగదు, రంగంబంజరలోని మరో ఐదుగురిని అదుపులోకి తీసుకుని రూ.3,800 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ వెంకటకృష్ణ తెలిపారు. అలాగే, వేంసూరు మండలం కుంచపర్తిలో పేకాట స్థావరంపై దాడులు చేసి నలుగురిని అదుపులోకి తీసుకోగా, ఎనిమిది మంది పరారయ్యారని ఎస్సై కవిత తెలిపారు. పట్టుబడిన వారి నుంచి రూ4 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

చోరీ కేసులో ముగ్గురు...

చింతకాని: పలువురి ఇళ్లలో చోరీ చేసిన మండలంలోని నాగులవంచకు చెందిన మేడా వినోద్, కాపర బోయిన నాగరాజు, ఆవుల సురేష్‌ను పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. పోలీసులు తిరుమలాపురం క్రాస్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టగా వీరు అనుమానాస్పదంగా కన్పించడంతో అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ సందర్భంగా నాగులవంచకు చెందిన మద్దినేని శ్రీనివాసరావు ఇంట్లో గతేడాది అక్టోబర్‌లో, మేడా రాములు ఇంట్లో ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆభరణాలు చోరీ చేసినట్లు అంగీకరించారు. దీంతో వారి నుంచి సొమ్మును రికవరీ చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు. అలాగే, మండలంలోని రామకృష్ణాపురంలో భూవివాదానికి సంబంధించి శీలం సుదర్శన్‌పై దాడి చేసిన మాలెపు కోటేశ్వరరావును గురువారం అరెస్ట్ చేశామని ఎస్సై నాగుల్‌మీరా వెల్లడించారు.

యువకుడిని దాచిపెట్టారంటూ తాళం

రఘునాథపాలెం: కలెక్టరేట్ సమీపాన, రఘునాథపాలెం మండలంలోని ఓ అంగన్‌వాడీ కేంద్రంలో యువకుడిని దాచి పెట్టి బయట నుంచి తాళం వేయడంతో గురువారం ఉద్రిక్తత నెలకొంది. వర్షాల నేపథ్యాన ప్రభుత్వం సెలవు ప్రకటించగా అంగన్‌వాడీ కేంద్రానికి సదరు యువకుడు ఎందుకొచ్చాడు.. లోపల ఉంచి తాళం ఎందుకు వేశారనే అంశం చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటమ్మను వివరణ కోరగా విషయం తమ దృష్టికి వచ్చిందని, శుక్రవారం వెళ్లి విచారిస్తామని తెలిపారు.

కృష్ణా ఎక్స్‌ప్రెస్ దారి మళ్లింపు

ఖమ్మం రాపర్తినగర్: నిజామాబాద్ జిల్లాలో భారీ వర్షాల కారణంగా తిరుపతి–ఆదిలాబాద్, ఆదిలాబాద్–తిరుపతి కృష్ణా ఎక్స్‌ప్రెస్‌ను దారి మళ్లించారు. తిరుపతి–ఆదిలాబాద్(17405) రైలు కాచిగూడ, వికారాబాద్ మీదుగా ఆదిలాబాద్ చేరుతుందని, ఆదిలాబాద్-తిరుపతి కృష్ణా ఎక్స్‌ప్రెస్(17406) నిజామాబాద్ మీదుగా పెద్దపల్లి, వరంగల్‌కు వస్తుందని ఖమ్మం సీసీఐ రాజ్‌గోపాల్ తెలిపారు.

పాముకాటుతో బాలిక మృతి

- తల్లి పరిస్థితి విషమం


గౌర లోహిత (ఫైల్)

సత్తుపల్లిరూరల్: ఇంట్లో నేలపై నిద్రిస్తున్న తల్లీకుమార్తెను కట్లపాము కాటు వేయడంతో కూతురు గౌర లోహిత(5) మృతి చెందగా.. ఆమె తల్లి మౌనికను మెరుగైన చికిత్స కోసం ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సత్తుపల్లి మండలం చిన్నపాకలగూడెంలో బుధవారం అర్ధరాత్రి 2గంటల సమయాన ఈ సంఘటన చోటు చేసుకుంది. పాము కాటు వేయగానే బాలిక, ఆమె తల్లి కేకలు వేస్తుండడంతో చుట్టుపక్కల వాళ్లు వచ్చి పామును చంపేశారు. ఆపై 108లో సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలోనే లోహిత మృతి చెందింది. దీంతో ఆమె తల్లి మౌనికను ప్రాథమిక చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి...


అక్తర్‌పాషా (ఫైల్)

సత్తుపల్లి: విద్యుదాఘాతానికి గురై హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న ఖమ్మంకు చెందిన లారీ డ్రైవర్ షేక్ అక్తర్‌పాషా(49) గురువారం మృతి చెందారు. సత్తుపల్లి మండలం తాళ్లమడలోని రైస్‌మిల్లు వద్ద ఈనెల 15న ఆగి ఉన్న లారీలో ఆయన కూర్చోగా లారీ కి విద్యుత్ వైర్లు తాకడంతో షాక్‌కు గురయ్యాడు. దీంతో సత్తుపల్లి, ఖమ్మంలో చికిత్స అనంతరం హైదరా బాద్ తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విద్యుత్‌శాఖ నిర్లక్ష్యంతోనే అక్తర్ మృతి చెందాడని ఆయన మేనమామ షేక్ ఘనీ సత్తుపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

- ఐదుగురికి గాయాలు

ఖమ్మంరూరల్: ఆగి ఉన్న కంటైనర్ లారీని ఆర్టీసీ బస్సు ఢీకొట్టగా ఐదుగురికి గాయాలయ్యాయి. వివరాలిలా.. 50 మంది ప్రయాణికులతో ఖమ్మం నుంచి సూర్యాపేటకు వెళ్తున్న సూర్యాపేట డిపో బస్సు మండలంలోని మద్దులపల్లి వద్దకు రాగానే అదుపు తప్పి రోడ్డు పక్కనే ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆర్టీసీ డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయి రెండు కాళ్లకు తీవ్ర గాయాలు కాగా, నలు గురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్‌ను బయటకు తీయించి ఆస్పత్రికి తరలించారు.

వైద్యఖర్చులు చెల్లించాలని తీర్పు

ఖమ్మంలీగల్: బీమా పథకం తీసుకున్న వ్యక్తికి వైద్య ఖర్చుల నిమిత్తం పరిహారం చెల్లించాలని జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ చైర్మన్ వి.లలిత, సభ్యురాలు ఏ.మాధవీలత గురువారం తీర్పునిచ్చారు. కల్లూరు మండలం చంద్రుపట్లకు చెందిన కాటమనేని రాజేశ్వరరావు ఆంధ్రా బ్యాంకు, మణిపాల్ సిగ్నహెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా కుటుంబంతో కలిపి 2024 ఫిబ్రవరిలో రూ.4లక్షల పరిమితితో పాలసీ తీసుకున్నాడు. ఆయన కొన్నాళ్లకు అనారోగ్యం బారిన పడి చికిత్స చేయించుకున్నాక ఖర్చులు చెల్లించాలని ఇన్సూరెన్స్ కంపెనీని కోరితే నిరాకరించారు. దీంతో న్యాయవాదుల ద్వారా కమిషన్‌ను ఆశ్రయించగా వైద్య ఖర్చులు రూ.2,27,284ను 7శాతం వడ్డీతో, వేదనకు గురి చేసినందుకు రూ.10వేలు, ఖర్చుల నిమిత్తం మరో రూ.10వేలు 45 రోజుల్లోపు చెల్లించాలని కమిషన్ తీర్పునిచ్చింది.

అందరి సహకారంతో ఎందరికో సాయం

ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ


సత్యనారాయణ దంపతులను సత్కరిస్తున్న అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: వసతిగృహ సంక్షేమ అధికారిగా ఉద్యోగంలో చేరిన తాను డీడీ స్థాయికి చేరానని.. అధికారులు, ఉద్యోగుల సహకారంతో అనేక మందికి సాయం చేయగలిగానని ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ తెలిపారు. ఈనెల 31న ఉద్యోగ విరమణ చేయనున్న డీడీ కస్తాల సత్యనారాయణ-వసంత దంపతులను వసతిగృహ సంక్షేమ అధికారుల ఆధ్వర్యాన గురువారం సన్మానించారు. ఖమ్మం ఏఎస్సీడబ్ల్యూఓ రవూఫ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీడీ మాట్లాడుతూ..అధికారిగా ప్రభుత్వ పథకాలను ప్రజల దరికి చేర్చానని తెలిపారు. వసతిగృహ సంక్షేమ అధికారుల ఫోరం అధ్యక్షుడు కోటపాటి రుక్మారావు మాట్లాడుతూ డీడీ సత్యనారాయణ ఉద్యోగ రీత్యా, సేవా కార్యక్రమాల ద్వారా ఎందరికో అండగా నిలిచారని గుర్తు చేశారు. కార్యాలయ ఉద్యోగులు ఎక్కిరాల శ్రీనివాసరావు, సముద్రాల శ్రీనివాసరావు, రహీముద్దీన్, టి.విజయలక్ష్మి, హెచ్‌డబ్ల్యూఓలు ఎస్.విజయ, ఎస్.వెంకటరెడ్డి, సత్తార్, కోమలి, సునిత, స్టాలిన్, వరలక్ష్మి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమరుల పోరాట స్ఫూర్తితో ముందుకు..


స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: బషీర్‌బాగ్ విద్యుత్ పోరాటంలో అసువులు బాసిన అమరవీరులకు వామపక్ష పార్టీల నాయకులు గురువారం నివాళులర్పించారు. 2000 సంవత్సరంలో విద్యుత్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా చేపట్టిన ప్రదర్శనలో పాల్గొన్న వారిపై బషీర్‌బాగ్ వద్ద పోలీసులు జరిపిన కాల్పుల్లో పలువురు మృతి చెందారు. ఈమేరకు సీపీఎం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ అధ్యక్షతన రామకృష్ణ స్తూపం వద్ద జరిగిన కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాగం హేమంతరావు, మాస్‌లైన్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సీ.వై.పుల్లయ్య మాట్లాడుతూ ఆనాడు చంద్రబాబునాయుడు తీరుపై ఉద్యమించగా.. అమరుల త్యాగాలతోనే రైతులకు ఉచిత విద్యుత్, పేదలకు సబ్సిడీ ఇస్తున్నారని తెలిపారు. కాగా, సంస్కరణలు, ఆర్థిక విధానాలు, మతోన్మాదానికి వ్యతిరేకంగా అమరుల సాక్షిగా పోరాడుతామని చెప్పారు. సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, వివిధ పార్టీల నాయకులు జానీమియా, శింగు నర్సింహారావు, బండి రమేష్, జి.రామయ్య, ఆవుల అశోక్, ఝాన్సీ, మాదినేని రమేష్, శ్రీనివాసరావు, మనోహర్, ఎం.ఏ.జబ్బార్, ఎస్.కే.మీరా, దొంగల తిరుపతిరావు, ఎస్.నవీన్‌రెడ్డి, కార్పొరేటర్లు గోపి, బి.జి.క్లైమెంట్ తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం

రోజుకు లక్ష టన్నుల ఉత్పత్తికి ఆటంకం


సత్తుపల్లి జేవీఆర్ ఓసీలో చేరిన వర్షం నీరు

సింగరేణి(కొత్తగూడెం)/సత్తుపల్లి రూరల్: మూడు రోజులు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా సింగరేణి వ్యాప్తంగా రోజుకు లక్ష టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. రోజూ 1.94లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి జరగాల్సి ఉండగా, కేవలం 94వేల టన్నులకే పరిమితమవుతోంది. తద్వారా మూడు రోజుల్లో 3లక్షల టన్నుల ఉత్పత్తికి విఘాతం ఏర్పడింది. అలాగే, సంస్థ వ్యాప్తంగా ఓవర్ బర్డెన్ తొలగింపు కూడా నిలిచిపోయింది. ఓసీల్లో క్వారీల్లో నిలిచిన వర్షపు నీటిని ప్లాన్‌టూన్ పంపుల ద్వారా బయటకు పంపిస్తున్నారు. కాగా, సత్తుపల్లి జేవీఆర్ ఓసీ, కిష్టారం ఓసీల్లో బొగ్గు ఉత్పత్తి, ఓవర్ బర్డెన్ తొలగింపు పనులు నిలిచిపోగా, ఓసీల్లో చేరిన నీటిని మోటార్ల సాయంతో బయటకు పంపిస్తున్నామని పీఓలు ప్రహ్లాద్, నర్సింహారావు తెలిపారు.

15 ఆర్టీసీ సర్వీసులు రద్దు..

ఖమ్మంమయూరిసెంటర్/సత్తుపల్లిటౌన్: రెండు రోజుల పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కురిసిన వర్షాలతో పలు ఆర్టీసీ బస్సు సర్వీసులు రద్దయ్యాయి. రీజియన్‌లోని మూడు డిపోల పరిధిలో 15 సర్వీసులను రద్దు చేసినట్లు రీజినల్ మేనేజర్ సరిరామ్ అన్నారు. సత్తుపల్లి ఆర్టీసీ డిపోను గురువారం పరిశీలించిన ఆయన బస్సుల నిర్వహణ, రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం మాట్లాడుతూ ఖమ్మం – బోనకల్ రోడ్డులో రామకృష్ణపురం వద్ద వాగు పొంగి పొర్లగా బోనకల్, విజయవాడ రూట్‌లో ఖమ్మం డిపోకు చెందిన ఎనిమిది బస్సులు, గార్ల – ఇల్లెందు రూట్‌లో బుగ్గ వాగు పొర్లడంతో ఒక సర్వీసు రద్దు చేశామని తెలిపారు. సత్తుపల్లి డిపో పరిధిలో చెరుకుపల్లి చప్టా పైకి వరద చేరగా అన్నపురెడ్డిపల్లి రూట్‌లో రెండు, రోడ్డు దెబ్బతినడంతో తిరువూరు రూట్‌లో రెండు, కావాడిగుండ్ల రూట్‌లో ఒక సర్వీసును రద్దు చేసినట్లు చెప్పారు. అలాగే, మణుగూరు డిపో పరిధి వెంకటాపురం వద్ద రోడ్డు దెబ్బతినడంతో గుండాలకు ఒక సర్వీసును రద్దు చేసినట్లు ఆర్‌ఎం వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ మల్లయ్య, మధిర డీఎం శంకర్‌రావు, అసిస్టెంట్ మేనేజర్లు శ్రీనివాస్, విజయశ్రీ, ఎంఎఫ్‌లు చక్రవర్తి, సాహితీ తదితరులు పాల్గొన్నారు.